పొందులుకొండి. నేను మిమ్మల్నీ, ఆయన్నీ కూడా అదే ప్రేమతో ఇప్పటికీ ప్రేమిస్తున్నాను. అది అసాధ్యం కాదు. ఎక్కడైనా అది అసంభం అయితే అది సాధారణంగా పురుషుల్లో వుండేనీచత్వం, జుగుప్స, ఈర్ష్య, అసహనం, అనుమానాలవల్లే కాని స్త్రీ తప్పు వల్ల కాదు.

"ఇంతకీ నే చెప్పేది, ఇవాళతో నేను మీనించి దూరమవుతాను. ఇది నా తుది నిర్ణయం. ఇదిగో ఈ కాగితం. దీనితో నా ఆస్థిమీద వున్న సర్వహక్కులూ మీవవుతాయి.

"నా కోరికేం లేదు. సాయంత్రం రైల్లో కాశీ వరకూ టికెట్ కొని మనః పూర్వకంగా పంపించండి. అదే నాకోరిక. మిమ్మల్నీ, చెల్లినీ మళ్లీ కలవను.

"కాని వేరే లోకమనేది వుంటే..."

గొంతు పొడారిపోయి, మాటే రాలేదు. కళ్ళు తడిశాయి. లక్ష్మీ, సంజీవరావూ, తెల్లబోయి, మాటలు వినసాగారు.

వాళ్ళు యెంత చెప్పినా శ్రీదేవి నిర్ణయం మార్చుకోలేదు. ఆ వేళ అక్కణ్ణించి కదిలింది...మళ్లీ ఏమైందో తెలీదు.

సంజీవరావు కూతురికి "శ్రీదేవి" అనీ, ఆ మిల్లులోని గుడ్డలకి "శ్రీదేవీ ఫాబ్రిక్స్"అనీ పేరు పెట్టాడు. ★

## పాలరాళ్ల ప్రేమచిహ్నం

స్వామి రమ్మన్నప్పుడూ, తర్వాత దారిలోనూ నేను చేసిన వితండ వాదన గుర్తుకు వచ్చి, నన్ను చూస్తే నాకే

విచారం కలిగించేలా చేసింది.

అప్పుడు "తాజమహల్ నిర్మాణానికి, రాళ్లెత్తిన కూలీ లెవ్వరు?...ఇది కాదోయ్ చరిత్ర కర్థం!" అని శ్రీ శ్రీ గొంతు చించుకుని పాడుతుండడం, ఏ పాతాళ లోకాల్లోంచో వినపడుతున్నట్టు, కొంచెం కొంచెంగానూ, హెచ్చు స్వరంతోనూ వినపడేది.

అందుకే చారిత్రిక ప్రదేశాలు చూడ్డానికి నేను అయిష్టపడింది. మనం నిజమైన చరిత్రనీ, ఆనాటి వాస్తవిక చిహ్నాల్నీ అక్కడ చూడం. వొట్టి, అల్లబడిన గాథలకి సంబంధించిన శిథిలాల్నే చూస్తాం.

"రేపు క్రిస్టమస్ సెలవలకి ఆగ్రా వెళ్ళాలి; మీరు కూడా తప్పకండా వస్తారనుకుంటున్నాం" అని స్వామిఅన్నాడు.

"యెందుకు?" అన్నాను. ఆయన లోపల నవ్వుకున్నాడేమో నా ప్రశ్నకి. అది నాకు తెలియదు. పైకి మాత్రం అన్నాడు:

"ఎక్స్కర్షన్! తాజ్ మహల్ని చూడ్డానికి!"

"ఆ రాజరికపు చిహ్నాన్నా?" నా కళ్లల్లో ఆ సమయంలో కోపం కనపడి వుంటుందనుకుంటాను. నిజానికి అంతగా వొళ్లు మండుకు పోయింది. ప్రజల రక్త మాంసాలని అన్నివిధాలా పీల్చుకు, పిప్పిచేసి, వాటితో యేవో కళాక్షేత్రాల్ని ఏ భార్యల కోరికలపైనో, లేకపోతే ఏ పేరుకోసమో నిర్మించిన పూర్వపు రాజుల స్వభావాన్ని తల్చుకుంటే ముఖం కంది పోసాగింది. ఈనాడు వడ్డీలకి వడ్డీలు అమాయకులైన రైతు, కూలీలనించి వసూలుచేసి ధర్మ

సతాళ్లిలు కట్టించే వణిక్ప్రముఖుల ధర్మాచరణలకంటె ఆ రాజుల చర్యల్లో గొప్ప యేమీ కన్పించలేదు నాకు.

కాని అది కొన్ని వందల మైళ్ళ దూరం నించి అన్నమాట!

ఇప్పటి మనోభావం వేరు. అయినా ఇదివరకటి నా వుద్దేశాలు పూర్తిగా తప్పు కాదనే నమ్మకం మనస్సులో ఇంకా లేక పోలేదు.

సంతోషపు ఔన్నత్యాన్ని మనస్సు రుచి చూసిన రాత్రి, అది. అంత ఆనందానుభవం పొందాను ఎవరికైనా అంతే! అద్వితీయానంద భరితులవుతారు. అబద్ధమాడ్డం లేదు.

గాఢమైన నిశ్శబ్దం పరిపాలనా సాగిస్తున్న రాత్రి!

ఆయనా, ఇంకా ఒకరిద్దరు మిత్రులూ, నేనూ అక్కడికి వెళ్ళాం.

పొగ మంచుని చీల్చుకుని వచ్చిన చంద్రకాంతి, పాలరాళ్లలో ప్రతిఫలించి, మళ్ళా పొగ మంచులో దారి తెలియకుండా కొట్టుకుంటుంటే చూడ గలగడం ఒక గొప్ప వరంగా వును అనిపించింది పిండి ఆరబోసినట్టున్న పండువెన్నెల! మన నీడల్ని, మనకి మన ప్రతిబింబాల్ని చూపిస్తున్న పాలరాళ్లు! వర్ణనకి నాకు మాటల అర్థాలకున్న శక్తి చాలనట్టుగా తోస్తోంది. అంత గొప్పగానూ, ఆహ్లాదకరంగానూ వుంది ఆ దృశ్యం.

అమితమైన నిశ్శబ్దం, చెట్ల నీడల్ని పట్టుకుని వేళ్ళాడే చీకట్లూ కొంత వరకూ విషాద స్ఫురణ కలిగించక పోలేదు.

చలికూడా ఎక్కువగానే వుంది స్వామికి ఎంతగా

చలినుంచి కాపాడుకుంటున్నా కొంత రొంప కూడా పట్టింది. ఆయన డాక్టరు. అందుకేనేమో అంతగా మంచి ఆరోగ్యంలో వుంటున్నట్టు కనిపించదు.

అందరికీకూడా అంతేగావును! మాట్లాడ లేనంత గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని అనుభవిస్తున్నట్టున్నారు. అంతా మౌనంగానే ఆనందిస్తున్నారు. యెదో ఏ నిమిషంలోనో ఐపొయ్యేదానిలా! స్వామి 'ఇప్పటికన్నా మీ పొరపాటు గ్రహించారా?' అన్నట్టు అప్పుడప్పుడు నా వైపు చూడసాగాడు. నేను కూడా నా కళ్ళని 'గిల్టీ'గా చూడడం అనేదాన్నుంచి తప్పించలేకపోయాను, ఎంత బలవంతంగా ప్రయత్నించినా.

ఆ దివ్య భవనంలో ప్రతిబింబించిన మధ్య యుగపు కళా సౌందర్యం కూడా నన్నాకర్షించక పోలేదు. ప్రపంచపు గొప్ప వింతల్లో ముఖ్యమైన వాటిలో ఒకటి! భారతీయ కళా క్షేత్రాల్లో ముఖ్యమైంది!!

పగలు చూసి ఆనందించింది చాలక, మళ్ళా ఇప్పుడు తీసుక వచ్చాడు స్వామి. అతని లెక్క సరి అయిందే. అంత కంటె వెయ్యిరెట్లు అత్యధిక సౌందర్యాన్ని చూడ గలిగాం మేం, ఆ వెన్నెల్లో.

పహారావాడు ఆవలిస్తున్నాడు. ఆవరణ దాటి బయట పడేటప్పటికి పన్నెండు దాటింది. మనస్సులో అచ్చుపడిన చిత్రం మాత్రం యెన్నటికీ తుడుచుకు పోదనే నమ్మకంతో అందరం ఇవతల కొచ్చాం. కొన్ని వందల సంవత్సరాల చరిత్రని దాచుకున్న ఆ భవనం కనుచూపు దూరం దాటే వరకూ తిరిగి తిరిగి మా దృష్టిని ఆకర్షించుకుని మనస్సుని ఇంకా

దోచుకుంది.

అప్పుడే నాకో వింత అనుభవం కలిగింది. ఆ దివ్య భవనంకంటె వెయ్యిరెట్లు అందంగానూ, ఆకర్షణీయంగానూ వున్నట్టుగా తోచే ముంతాజ్ మహల్ ముఖం కనిపించి నట్ట యింది. అవును, అది ప్రేమ చిహ్నం, కదూ!

కాని ఒకందుకే విచారం కలిగింది, తర్వాత.

స్వామి ఇంటికి వెళ్ళాక అన్నాడు: "మీరు తాజ్ మహల్‌ని చూస్తున్నప్పుడు శ్రీ. శ్రీ. వాక్యం గుర్తుకు వచ్చిందా?"

"ఏం?" అన్నాను నేను, అనాలోచితంగా. నాకు అసలు ఆ మాటే గుర్తులేదు, నిజానికి.

కొంతసేపయ్యాక స్వామి అన్నాడు, రగ్గుతో కాళ్లనిం చి, తలవరకూ కప్పుకుంటూ:

"అదా మీరు చూసింది? అంతసేపూ అదొక చరి త్రాత్మక ప్రదేశమనే సంగతే మర్చిపోయారన్నమాట? దాని గొప్పతనం అనుభవించడంతో అన్నీ గుర్తుకు రావులెండి.

"నాకు మాత్రం అట్లా కాలేదు. యెందుకంటే ప్రతి రాయి రాయికీ వెనకాల యెంతో చరిత్ర కన్పించింది, నాకు. వాటిని అక్కడ పదిలంగా పెట్టి భవన నిర్మాణానికి తోడ్పడిన కూలీల చెమట బిందువుల్ని స్పష్టంగా చూడ గలిగాను.

"ప్రతీ చెక్కడంలోనూ ఆ చిత్రకారుల పరిశ్రమ చూడ గలిగాను ఒక మాటలో చెప్పాలంటే ఆ భవనం లోని ప్రతీ అంగుళం తనలో యెంతో చరిత్రని, సాధారణ మానవులు గ్రహించని చరిత్రని, నిలువ చేసుకుని ప్రదర్శం

కనిపించింది, నాకు; 'ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని' చరిత్రంతా. నన్నడుగుతే తాజ్‌మహల్ విలువ కట్ట శక్యం కానిది! షాజహాన్ యెంతో అభినందనీయుడు! అతను ముంతాజ్ మరణం తరువాత కార్చిన కంటి నీటి బొట్టుకొక వరహాగా ఖర్చుచేసి ఆ భవనాన్ని నిర్మించి వున్నా డనుకుంటాను. దాన్ని తన ప్రేమ చిహ్నంగా, ప్రియురాలి మీద ఇష్టం కొలిదీ అతను కట్టించాడు. సాధారణ మానవు లూ, చరిత్రకారులూ అంతే చూడ గలుగుతారు. అట్లానే గౌరవిస్తారు కూడా.

"కాని ఆ భవనం వెనకాల యెంత మందో కష్ట జీవుల జీవిత చరిత్రల్నీ, శిల్పుల శిల్ప చాతుర్యాన్నీ తరతరాల వర కూ నిలిచేలా చేశాడంటాను. అతను నిర్మించ దల్చుకున్నది తన ప్రేయసికి ప్రేమ చిహ్నం. కాని నిజంగా నిర్మించింది వేలకొలిదీ కార్మికుల, శిల్పుల జీవితాల ప్రతిబింబాన్ని."

తర్వాత స్వామి మౌనంలో పడ్డాడు. నిద్దరోయాడేమో కూడా. నాకు చెమటలు గక్కుకుంటూ తాజ్‌మహల్ని నిర్మిస్తున్న శిల్పులూ, కార్మికులూ, తయారవుతున్న ప్రతిదా న్ని కళ్ళ నీళ్లు కార్చుకుంటోనే, ఆత్మసంతృప్తికోసం పరీక్ష చేస్తున్న షాజహానూ కళ్లకి కట్టినట్టయ్యారు.

'అవును. అది పాలరాళ్ల ప్రేమచిహ్నం—ముంతాజ్‌ది కాదు; వేల కొలిదీ కార్మికులది' అనుకున్నాను నేను, నిద్ర పోడానికి ప్రయత్నిస్తూ. ★